రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 8,632 మంది విద్యార్థులు
- 50 పరీక్ష కేంద్రాలు

భువనగిరి అర్బన్, మార్చి 19 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 8,632 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, 50 పరీక్ష కేంద్రాలను కేటాయించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పర్యవేక్షణకు 50 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 50 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 556 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ఈ ఏడాది అడిషనల్ షీట్స్ కాకుండా 24 పేజీలు, 12 పేజీలతో బుక్‌లెట్స్‌ను విద్యార్థులకు ఇవ్వనున్నారు. ప్రశ్నాపత్రంపై క్యూ ఆర్ కోడ్‌తో పాటు సీరియల్ నంబర్‌ను ప్రతి పేజీపై ముద్రించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలోని జీరాక్స్ సెంటర్లు మూసివేయాలని పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ద్రావణం, ఇతర అనారోగ్య కారణాలకు చికిత్స అందించడానికి కేంద్రాల వద్ద ఇద్దరు ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారు. ఇతర సమస్యలుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 9010772080ను అందుబాటులో ఉంచారు.

గంట ముందే చేరుకోవాలి

విద్యార్థులు పరీక్షకు ఒకగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా కేవలం 5 నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో అంటే 9.35 వరకు కేంద్రంలోకి అనుమతిస్తారు. ఓఎంఆర్ షీట్‌లో తమ వివరాలు సరి చూసుకోవాలి. తప్పులుంటే వెంటను ఇన్విజిలేటర్‌కు తెలియజేయాలి. పరీక్ష రాసే కేంద్రాన్ని విద్యార్థులు ఒకరోజు ముందే చూసుకుంటే ఇబ్బందులుండవు.

- కే.సత్యనారాయణ, డీఈఓ

ప్రభుత్వ భూములను సేకరించాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్ : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరికలెక్టరేట్, మార్చి 19 : జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్ కోసం రైల్వే, ప్యాకేజీ-14కు సంబంధించిన పిల్ల కాల్వల నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ భూములను సేకరించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ మీటింగ్ హాల్‌లో బుధవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి సర్వే ల్యాండ్ రికార్డ్స్, సర్వేయర్, ఇరిగేషన్, అధికారులతో రిజర్వాయర్, కెనాల్స్, రైల్వే కోసం భూసేకరణకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలాల్లో సర్వే ల్యాండ్ కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డు అధికారి జగన్నాథరావు, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్, సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

ఈనెల 21 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై మండల విద్యాధికారులు, పరీక్ష సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో కలెక్టర్ బుధవారం జూమ్ మీటింగ్ ద్వారా రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ రఘురాంరెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

వలిగొండ : ప్రభుత్వ దవఖానల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ హనుమంతరావు వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోజు వారి రోగుల వివరాలను సమీక్షించి సిబ్బంది సయమ పాలన పాటించాలన్నారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, వైద్యాధికారి స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీ రాందేవ్, విద్యార్థులు

రాష్ట్ర బడెట్‌లో విద్యార్థులకు తీవ్ర అన్యాయం : మోదీ రాందేవ్

భువనగిరి అర్బన్ , మార్చి 19 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించక పోవడంతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం భువనగిరి పట్టణంలో విద్యార్థులతో కలిసి స్థానిక జూనియర్ కాలేజీ నుంచి ప్రిన్స్ రస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం రూ.23, 108 కోట్ల నిధులే కేటాయించడంతో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కోటరీ కమిషన్ ప్రకారం విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా.. కేవలం 5.5 శాతం నిధులు కేటాయించడమేంటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, సీఎం రేవంత్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున మిలిటెంట్ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, నాయకులు అనిల్, మధు, ఎండి నిహాల్, సిద్ధార్థ, వాసు, మణికంఠ, రమాదేవి, మల్లీశ్వరి, ఉదయ్ శ్రీ, విగ్నేశ్వరి పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకాలి : కిరణ్

భువనగిరి అర్బన్, మార్చి 29 : బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొనడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు రోడ్డు మార్గంలో సూర్యాపేటకు వెళ్లనున్నారు. విజయవాడ- హైదరాబాద్ రహదారి (పోచంపల్లి) కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పార్టీ భువనగిరి పట్టణాధ్యక్షుడు ఏవి.కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు భువనగిరి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి బయల్దేరుతారని బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి : నిరంజన్ గౌడ్

చౌటుప్పల్, మార్చి 19 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సూర్యాపేట జిల్లాలో చేసే పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల వరకు చౌటుప్పల్ బస్టాండ్ వద్దకు చేరుకుంటారని, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలుకాలని పిలుపునిచ్చారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం

- కూరెళ్ల విఠలాచార్య, డీఈఓ సత్యనారాయణ

రామన్నపేటలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

రామన్నపేట, మార్చి 19 : తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మితమవుతుందని పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, డీఈఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెల్లంకి జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం జరిగిన వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి, ఎంఈఓ జ్యోతి, ఏఏపీసీ చైర్మన్ కె.ఉదయరాణి, లయన్స్ క్లబ్ ప్రతినిధి బోగోజు గోవర్ధనాచారి పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలి : డాక్టర్ బెల్లి యాదయ్య

వలిగొండలో మాట్లాడుతున్న డాక్టర్ బెల్లి యాదయ్య

వలిగొండ, మార్చి 19 : ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి విద్యార్థులు చదువుతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, మట్టికవి డాక్టర్ బెల్లి యాదయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, ఎంఈఓ, హెచ్ఎం సుంకోజు భాస్కర్, ఉపాధ్యాయులు నాగేందర్, సైదారెడ్డి, విజయనిర్మల, శ్రీను, వెంకటేశ్వర్లు, స్వామి, విమల, కవిత, మల్లేశం, వెంకటేశ్వర్లు, గులాం జిలాని పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎంఈఓ ప్రభాకర్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో మండల విద్యాధికారి పి.ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాకరి రేణుకానర్సింగ్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి : ఎస్ఐ అనిల్‌కుమార్

రాజాపేట, మార్చి 19 : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. రాజాపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయంత, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి : సూర్య నారాయణరెడ్డి

రంజాన్ సరుకులను పంపిణీ చేస్తున్న జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయరెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 19 : ముస్లింలు రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో అందించిన రూ.15వేల విలువగల రంజాన్ సరుకులను పట్టణంలోని ఇస్లాంపుర మసీదు వద్ద బుధవారం ముస్లిం కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇంతియాజ్, ఇస్తియాక్, ఎండి.కమ్రాన్, మొఖ్తా, సలీం, సయ్యద్ షకీల్, అహ్మద్ పాల్గొన్నారు.

తాగునీటికి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), మార్చి 19 : గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందివ్వాలని, ముందస్తు చర్యల్లో భాగంగా అద్దె బోర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకునేందుకు ముందుకొస్తే వారిని గుర్తించాలన్నారు. అదే విధంగా జాతీయ ఉపాధిహామి పథకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ 100 రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, సూపరిండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూమి అక్రమ డాక్యుమెంట్లను రద్దు చేయాలి : బుర్హానుద్దీన్

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీవాణికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 19 : పట్టణంలోని మీనానగర్‌లో గల సర్వే నంబర్ 963లో గల పీర్ల కోట్టానికి ఇచ్చిన ఇనామ్ భూమి వక్ఫ్‌బోర్డుదేనని కోర్టు నుంచి తీర్పు వచ్చిన తర్వాత కొందరు ఖబ్జా చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండి.బుర్హానుద్దీన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీవాణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 963లో అబ్దుల్ రఫూఫ్ పేరున రెండు ప్లాట్లు, పి.లక్ష్మీదేవి పేరున రెండు ప్లాట్లు, సింగబోయిన పమీలా పేరున ఒక ప్లాటు చొప్పున అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని ఇండ్లు నిర్మించుకొని ఇంటి నంబర్లు కూడా పొందారని ఆరోపించారు. పూర్తి విచారణ జరిపి అక్రమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ మైనార్టి నాయకులు శేఖ్ మజహర్‌పాష, ఎండి.ముతహర్ మసూద్, ఎండి.అంజద్, ఎండి.ఇస్మాయిల్ ఉన్నారు.

చేనేత రంగానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి : భిక్షపతి

మాట్లాడుతున్న సంఘం పర్సన్స్ ఇన్‌చార్జి కందగట్ల భిక్షపతి

చౌటుప్పల్, మార్చి 19 : బడ్జెట్‌లో చేనేత రంగానికి ప్రభుత్వం రూ.1000కోట్లు కేటాయించాలని చౌటుప్పల్ చేనేత సంఘం పర్సన్స్ ఇన్‌చార్జి కందగట్ల భిక్షపతి అన్నారు. పట్టణంలో బుధవారం చేనేత సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆదాయ, వ్యయాలను ఆయన చదవి వినిపించారు. ఆనంతరం సంఘం సభ్యుల తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత సంఘాల్లో నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నాణ్యతతో కూడిన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో నాయకులు చిక్క నర్సింహ, బడుగు మాణిక్యం, గుర్రం రవీందర్, గోశిక చక్రపాణి, గుర్రం నర్సింహ, గోశిక నర్సింహ, బడుగు అంజయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన ట్రాన్స్‌ఫార్మర్

రోడ్డుపై పడిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కారుతున్న కరెంట్ ఆయిల్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 19 : ట్రాన్స్‌ఫార్మర్ల లోడుతో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న లారీ నుంచి ప్రమాదవశాత్తు ఒక ట్రాన్స్‌ఫార్మర్ పట్టణ పరిధిలోని పగిడిపల్లి వద్ద బుధవారం కింద పడింది. దీంతో అది ధ్వంసమై అందులో నుంచి వచ్చిన కరెంట్ ఆయిల్ రోడ్డు నిండా వ్యాపించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడంతో విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఆయిల్ పడిన చోట ట్రాక్టర్‌తో డస్ట్ పోయించి శుభ్రం చేయించారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలని ధర్నా

సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా

వలిగొండ, మార్చి19 : పట్టణ కేంద్రంలో తాగు నీటి సమస్యను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి సిరపంగి స్వామి మాట్లాడుతూ 29వ సర్వే నంబర్‌లో నివాసం ఉన్న కాలనీ వాసులు వ్యవసాయ బావుల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకునే దుస్థితి దాపురించిందన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కూర శ్రీనివాస్, గర్ధాసు నరసింహ, నానచర్ల రమేశ్, వేముల లక్ష్మయ్య, కర్నాటి వెంకటేశం, శీలం ఇందిర, లక్ష్మీనారాయణ, దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు

మీ సేవలో అధిక డబ్బు వసూలు చేస్తే చర్యలు : సాయికుమార్

రాజాపేట, మార్చి 19 : మీ సేవ కేంద్రాల్లో నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మేనేజర్ ఎన్.సాయి కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన పథకాల గురించి మీసేవ కేంద్రాల నిర్వాహకులకు సూచనలు, సలహాలు చేశారు.

భూ విక్రయంలో అక్రమాలు అవాస్తవం : ఎర్ర అయిలయ్య

యాదగిరిగుట్ట, మార్చి 19 : ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బామ్మర్ది భూ కబ్జా ఆరోపణలపై మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన ఎర్ర అయిలయ్య స్పందించి బుధవారం ప్రకటన విడుదల చేశారు. రఘునాథపురం గ్రామంలో భూమి విషయంలో చేసిన పలు ఆరోపణలు తన పరువుకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆకుల నరసింహ వద్ద 2024 సెప్టెంబర్ 17న ఒక ఎకరం భూమిని కొనుగోలు చేసి, 2024 నవంబర్ 16న పిట్టల ప్రభాకర్‌కు విక్రయించినట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరుగలేదని పేర్కొన్నారు.

పారిపోయిన బాలుడు తిరిగి అప్పగింత

- క్రికెట్ బాల్ తగిలి టీవీ ధ్వంసం కావడంతో భయపడి పరార్

భువనగిరి అర్బన్, మార్చి 19 : ఇంటి నుంచి బాలుడు వెళ్లిపోయి మళ్లీ దొరికిన ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పరిధిలోని క్రిస్టల్ కాలనీలో నివాసం ఉంటున్న బొందల వెంకటకృష్ణ కుమారుడు వెంకటసుధీర్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పక్కన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా బాల్ పక్కనున్న ఓ ఇంట్లో ఉన్న టీవీకి తగిలి పగిలిపోయింది. సుమారు రూ.లక్ష విలువ గల టీవీ పగిలిపోవడంతో యాజమాని, తండ్రి వెంకటకృష్ణ తిట్టి, కొడుతారనే భయంతో సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి పారిపోయాడు. రాత్రి 7 గంటల వరకు రాకపోవడంతో తండ్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో భువనగిరి బస్టాండ్‌లో ఉన్న వెంకటసుధీర్‌ను అతడి ఫ్రెండ్స్ చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బాలుడిని స్టేషన్‌కు తీసుకు రాగా ఎస్ఐ అరుణ్‌కుమార్ సమక్షంలో తండ్రికి అప్పగించారు.

పశువైద్య శిబిరం

ఆలేరురూరల్, మార్చి 19 : మండలంలోని గుండ్లగూడెంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 65 పశువులకు చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి చైతన్య, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) తాసీల్దార్‌గా లావణ్య

ఆత్మకూరు(ఎం), మార్చి 19 : మండల తాసీల్దార్‌గా వి.లావణ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వహిస్తుండగా తాసీల్దార్‌గా బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ విధులు చేపట్టిన రవికుమార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా లావణ్యను నియమించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఆత్మకూరు(ఎం) : కూరెళ్లలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), మార్చి19 : మండలంలోని కూరెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో అందించిన పరీక్ష ప్యాడ్లను బుధవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎరుకల స్వామిగౌడ్, కార్యదర్శి గడ్డం అశోక్, ఉప్పల నర్సింహ, మల్లయ్య, నవీన్, మణికుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : పట్టణ పరిధిలోని రాయగిరి జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు బుధవారం నవభారత్ యూత్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్, హెచ్ఎం ఎన్, అండాలు, ఉపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, అలీషరీఫ్, విజయ, కిరణ్‌కుమార్, అనురాధ, భాస్కర్, అనిత, కనకయ్య, వీరారెడ్డి, విజయలక్ష్మి, రఘువీర్, గణపతి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని వంకమామిడి జడ్పీహెచ్ఎస్‌లో జి టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ కస్తూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి అందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఈ వార్షిక ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.10వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి అందిస్తామని తెలిపారు.

మోత్కూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పట్టణానికి చెందిన దాత పల్లెర్ల కల్యాణి -వెంకన్న దంపతులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వేర్వేరుగా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీనర్సింహారెడ్డ, పాఠశాల హెచ్ఎం టి.గోపాల్‌రెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, సమీర్, బయ్యని రాజు, సమీర్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

పిల్లాయిపల్లి కాల్వతో చెరువులు నింపాలని ఈఈకి వినతి

నీటి పారుదల శాఖ ఈఈ మనోహర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చౌటుప్పల్, మార్చి 19 : పిల్లాయిపల్లి కాల్వ ద్వారా గొలుసుకట్టు చెరువులు, కుంటలను నింపి సాగు నీరు అందించాలని రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చిన్ననీటి పారుదల శాఖ ఈఈ కే.మనోహర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాగు, సాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిల్లాయిపల్లి కాల్వ పారుతున్నా ఇప్పటికీ కూడా కొంత భూమి మాత్రమే సాగులోకి వచ్చిందన్నారు. కొన్ని చోట్ల రైతులే సొంత ఖర్చులతో ఈ కాల్వ ద్వారా చెరువులను నింపుకుంటున్నారని, దీన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తే వేల ఎకరాలు సాగులోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం ర